96 శాతం పోలింగ్ పూర్తి

● నేడు కూడా పోస్టల్ బ్యాలెట్

పార్వతీపురం, మే8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నాలుగు ఫెసిలిటేషన్ ఫెసిలిటేషన్ కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ కొనసాగుతోంది. ఇప్పటివరకు 96 శాతం మేర పోలింగ్ పూర్తయ్యింది. కాగా బుధవారం పార్వతీపురంలో 171, సాలూరులో 89, పాలకొండలో 138, కురు పాంలో 159 చొప్పున ఓట్లు పోలయ్యాయి. పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని మరో రోజు పొడిగించినట్లు కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. గురువారం కూడా ఉద్యోగులు ఫెసిలిటేషన్ కేంద్రాల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

అన్న క్యాంటీన్‌పై అక్కసు



పార్వతీపురంలోని అన్న క్యాంటీన్ భవనంలో ప్రజారోగ్య శాఖ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం నిర్వహిస్తున్న దృశ్యం

- అధికారంలోకి రాగానే మూయించేసిన వైసీపీ
- నాణ్యమైన భోజనానికి దూరమైన పేదలు
- మొక్కుబడిగా ఆహా క్యాంటీన్ ఏర్పాటు
- నిర్వహణకు నిధులు కేటాయించని సర్కారు
- పెదవి విరుస్తున్న జిల్లావాసులు

(పార్వతీపురం- ఆంధ్రజ్యోతి)

ప్రజలకు పట్టెడన్నం పెట్టడం ప్రభుత్వాల బాధ్యత. ఈ నేపథ్యంలో గత టీడీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసింది. అప్పట్లో రూ.5లకే భోజనం పెట్టింది. భవన నిర్మాణ కార్మికులు, రోజువారీ కూలీలు, చిరు ఉద్యోగులు, యాచకులు.. మధ్యాహ్న వేళల్లో అక్కడే భోజనం చేసేవారు. అన్న క్యాంటీన్లలో రూ.15కే ఉదయం టిఫిన్, మధ్యాహ్నం , రాత్రి భోజనం లభించడంతో వారికి ఖర్చులు బాగా కలిసివచ్చేవి. అయితే వైసీపీ అధికారంలోకి రాగానే సీన్ మారింది. పేదలకు అన్న క్యాంటీన్ భోజనం దూరం చేశారు. పట్ట ణాల్లో వాటిని వార్డు సచివాలయాలుగా మార్చుచేశారు. కొన్నిచోట్ల అన్నక్యాంటీన్ల కోసం నిర్మించిన అవుట్ లెట్‌లను వేరే అవసరాలకు వినియోగించారు. దీనిపై ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో వైసీపీ సర్కారు.. త్వరలోనే క్యాంటీన్లు తెరుస్తామని చెబుతూ వచ్చింది. చివరకు అయిష్టంగానే 'ఆహా క్యాంటీన్' తెరిచింది. అయితే వాటి నిర్వ హణకు.. బడ్జెట్ కేటాయించలేదు. చివరకు ఆహా క్యాంటీన్ పేరుకే అన్నట్లుగా మారాయి.

ఇదీ పరిస్థితి..

పేదల కోసం గత టీడీపీ ప్రభుత్వం 2018లో అన్న క్యాంటీన్లకు శ్రీకారం చుట్టింది. కూలీలు, కార్మికులు, చిరు వ్యాపారులు, యాచకు లు.... ఇలా పట్టణ పేదలు నామమాత్రపు ఖర్చుతో మూడుపూటలా కడుపు నింపుకొనేలా అన్న క్యాంటీన్లకు రూపకల్పన చేసింది. 'అక్షయ పాత్ర' అనే స్వచ్ఛందసంస్థతో ఒప్పందం కుదుర్చుకుని రూ.15లకే మూడు పూటలా వేడి వేడి భోజనం అందించేవారు. కాగా జిల్లా కేంద్రం పార్వతీపురంలో అన్న క్యాంటీన్ ప్రారంభించి.. ఎంతో మంది పేదలకు ఐదు రూపాయలకే అన్నం పెట్టి ఆకలి తీర్చారు. అప్పట్లో రోజుకు 300 మంది అన్న క్యాంటీన్‌లో కడుపునిండా భోజనం చేసేవారు. పార్వతీపురం పట్టణంతో పాటు సమీప ప్రాంతాల ప్రజలు అక్కడకు చేరుకుని భోజనం చేసి తమ ఆకలి తీర్చుకునేవారు. రోజుకో రకమైన టిఫిన్ , భోజనంలో అన్నం, సాంబారు, కూర పచ్చడి, పెరుగు ఉండేది. అయితే ఐదు రూపాయలకే నాణ్యమైన టిఫిన్, భోజనం లభిస్తుండడంతో పేదలు ఎంతో ఆనందించేవారు. అదే విధంగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే కార్మికులు, ఆటో డ్రైవర్లు, నిరుద్యోగులు కూడా అన్న క్యాంటీన్‌కు చేరుకుని భోజనం చేసేవారు. పాలకొండ, సాలూరులోనూ అన్న క్యాంటీన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్న సమయంలో ఎన్నికలు రావడంతో ఆయా చోట్ల ప్రారంభం కాలేదు. అయితే వైసీపీ అధికారంలోకి రావడం పేదలకు శాపంగా మారింది. వైసీపీ సర్కారు పాలనా పగ్గాలు చేపట్టిన వెంటనే అన్న క్యాంటీన్ మూసివేయించింది. దీంతో పేదలు నాణ్యమైన భోజనానికి దూరమయ్యారు. ప్రస్తుతం జిల్లా కేంద్రంలో ఉన్న అన్నక్యాంటీన్ భవనాన్ని ప్రజారోగ్య శాఖ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంగా మార్చారు.



మొక్కుబడిగానే..

అన్న క్యాంటీన్‌ను మూసివేతతో ప్రజల నుంచి వైసీపీ సర్కారు తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకుంది. దీంతో ఎన్నికలకు ముందు ప్రభుత్వం జిల్లాకేంద్రం పార్వతీపురంలో ఆహా క్యాంటీన్‌ను ప్రారంభిం చింది. అయితే దీనికి ప్రజల నుంచి ఆదరణ కరువైంది. ధరలు అధి కంగా ఉండడం.. భోజనం నాణ్యతగా లేకపోవడంతో ఇక్కడకు వెళ్లేం దుకు పట్టణ పేదలు ఆసక్తి చూపడం లేదు. దీంతో అది వెలవెలబో తోంది. ప్రస్తుతం దానిని మొక్కుబడిగా మాత్రమే నిర్వహిస్తున్నారు.

వైసీపీ తీరుపై ఆగ్రహం..

పాలనా పగ్గాలు చేపట్టిన నాటి నుంచి కక్ష సాధింపు రాజకీయాలకు తెరతీసిన జగన్.. పేదల కడుపు నింపే కార్యక్రమాలను ప్రోత్సహించక పోవడంపై జిల్లావాసులు మండిపడుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేశారనే కారణంగా వాటిని మూసివేయించి తమ లాంటి పేదలను నాణ్యమైన భోజనానికి దూరం చేయడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..

నేను ఒక ప్రైవేట్ దుకాణంలో పనిచేస్తున్నాను. అన్న క్యాంటీన్ ఉండేటప్పుడు అక్కడే మధ్యాహ్నం భోజనం చేసేవాడిని. ఐదు రూపాయలకే రుచికకరమైన, నాణ్యమైన భోజనం దొరికేది. వైసీపీ వచ్చిన తర్వాత వాటిని మూసివేయడం వల్ల నాలాంటి ఎంతోమంది కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

-కె.రవీంద్ర, కార్మికుడు, పార్వతీపురం

ఆకలి తీరేది...

నేను ప్రైవేట్ వాహనం నడుపుకొని జీవనం సాగిస్తున్నాను. అన్న క్యాంటీన్ ఉన్న సమయంలో అక్కడే రోజూ మధ్నాహ్న భోజనం చేసేవాడిని. రూ.5లకే ఆకలి తీరేది. ఇప్పుడు మధ్యాహ్నం భోజనం కోసం రోజుకు రూ. 80 ఖర్చు చేయాల్సి వస్తోంది.

-అప్పారావు, ప్రైవేట్ వాహన డ్రైవర్, పార్వతీపురం

క్యారేజీ అవసరం ఉండేది కాదు...

నేను ఒక హోల్‌సేల్ దుకాణంలో పనిచేస్తున్నాను. అన్న క్యాంటీన్ ఉన్నప్పుడు ఐదు రూపాయలకే కడుపు నిండా భోజనం తినేవాడిని. ఇంటిదగ్గర నుంచి క్యారేజ్ తెచ్చుకునే వాడిని కాదు. అన్న క్యాంటీన్ మాలాంటి వారికి ఎంతో ఉపయోగకరంగా ఉండేది.

-అప్పలనాయుడు, కార్మికుడు, పార్వతీపురం

నేడు చంద్రబాబు రాక

● కురుపాంలో ఏర్పాట్లు పూర్తి చేసిన టీడీపీ శ్రేణులు



హెలీప్యాడ్‌ను పరిశీలిస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరేష్ చంద్రదేవ్ తదితరులు

పార్వతీపురం, మే8 (ఆంధ్రజ్యోతి)/ కురుపాం,మే8: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు గురువారం ఉదయం 11:30 గంటలకు కురుపాం రానున్నారు. అక్కడి నుంచి ఆయన రోడ్డు మార్గంలో రావాడ జంక్షన్‌కు చేరుకుని బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. ఈ మేరకు అధినేత పర్యటన విజయవంతం చేసేందుకు టీడీపీ శ్రేణులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ ఆధ్వర్యంలో ఇప్పటికే హెలీప్యాడ్ సిద్ధం చేశారు. బహిరంగ సభకు ఏర్పాట్లు చేశారు. మరోవైపు బుధవారం ఐదు మండలాల ముఖ్య నాయకులు సమా వేశమై.. భారీగా జన సమీకరణపై చర్చలు జరిపారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి విజయరామరాజు, టీడీపీ కురుపాం అభ్యర్థి తోయక జగదీశ్వరి, టీడీపీ నాయకులు కె.రంజిత్‌కుమార్, డి.లక్ష్మణరావు, డి.రామకృష్ణ, డి.సత్యనారాయణ, మధుసూదనరావు, ఉదయ శేఖర్‌పాత్రుడు, జి.సుదర్శనరావు, కొండయ్య, వెంకట నాయుడు, రాంబాబు, మధు తది తరులు పాల్గొన్నారు. టీడీపీ అధినేత చంద్ర బాబు పర్యటన దృష్ట్యా కురుపాంలో బాబా గుడి వద్ద సిద్ధం చేసిన హెలీప్యాడ్ , రావాడ జంక్షన్‌లో బహిరంగ సభ వద్ద భద్రత ఏర్పాట్లను ఎస్పీ విక్రాంత్ పాటిల్, పాలకొండ డీఎస్పీ కృష్ణారావు, సీఐ సత్యనారాయణ, ఎస్ఐ షణ్ముఖరావు తదితరులు పరిశీలించారు. హెలీప్యాడ్ వద్ద పనులను ఆర్‌అండ్‌బీ జేఈ నిర్మల కుమారి పర్య వేక్షించారు. విద్యుత్ తీగల వల్ల ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు విద్యుత్‌శాఖ ఏఈ ఎం.రాజేంద్రప్రసాద్ తెలిపారు.

ఇదీ షెడ్యూల్

టీడీపీ అధినేత చంద్రబాబు హెలీకాప్టర్ ద్వారా గురువారం ఉదయం 11:20 గంట లకు విశాఖ నుంచి నేరుగా కురుపాం రానున్నారు. 11:25 గంటలకు హెలీప్యాడ్ నుంచి రోడ్డు మార్గం ద్వారా రావాడ జంక్షన్‌కు చేరుకుంటారు. 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 12:45 గంటలకు బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. అనంతరం 12:55 గంటలకు సభా ప్రాంగణం నుంచి బయల్దేరి హెలీప్యాడ్‌కు చంద్రబాబు చేరుకుంటారు. ఒంటి గంట నుంచి రెండు గంటల వరకు భోజన విరామం ఉంటుంది. కురుపాంలో మధ్యాహ్నం రెండు గంటలకు బయలుదేరి నేరుగా విజయనగరం జిల్లా చీపురుపల్లికి చేరుకుంటారు.

ప్రశాంత ఎన్నికలకు పక్కాగా ఏర్పాట్లు: కలెక్టర్

13న లోకల్ హాలీడే

పార్వతీపురం, మే8 (ఆంధ్రజ్యోతి): ప్రశాంత ఎన్నికలకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. బుధ వారం కలెక్టరేట్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామ రాజు జిల్లాల అధికారులతో మాట్లాడారు. 13న జరిగే పోలింగ్‌కు సంబంధించి సామగ్రి పంపిణీ, రవాణా, రూట్లు తదితర అంశాలపై దృష్టిసారించాలని సూచించారు. అనంతరం ఆయన ఉల్లిభద్ర ఉద్యాన కళాశాలలో కౌంటింగ్ సెంటర్లను పరిశీలించారు. రిసీవింగ్, రిసెప్షన్ సెంటర్ల పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. పోలింగ్ దృష్ట్యా సోమవారం లోకల్ హాలీడేగా కలెక్టర్ ప్రకటించారు.

'స్థానిక' పోరును తలపించేలా..



(పాలకొండ)

గతంలో ఎన్నడూ లేని విధంగా సార్వత్రిక ఎన్నికల సమరం జరుగుతోంది. సాధారణంగా ఎమ్మెల్యే ఎంపీ ఎన్నికలకు గ్రామీణులు అంత ప్రాధాన్యం ఇవ్వరు. ఎన్నికల రోజుకు స్థానికంగా ఉన్న వారితోనే ఓట్లు వేయిస్తారు. స్థానిక సంస్థల ఎన్నికలకు మాత్రం గ్రామాల్లోని ప్రతి ఓటరు వచ్చేలా చూస్తారు. ఈసారి ఎన్నికలు ప్రతిష్ఠాత్మకం కావడంతో స్థానిక సమరాన్ని తలపిస్తున్నాయి. వలస వెళ్లిన వారిని ఎలాగైనా సొంత ప్రాంతాలకు తీసుకొచ్చి... ఓటు హక్కు వినియోగించుకొనేలా వివిధ పార్టీల అభ్యర్థులు ప్రణాళికలు రూపొందించారు. గతంలో కేవలం స్థానిక ఎన్నికల సమయంలోనే అభ్యర్థులు వలస ఓటర్లను తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేసేవారు. ఈసారి అన్ని పార్టీల అభ్యర్థులూ వలస ఓటర్లపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రత్యర్థి పార్టీ అభ్యర్థి వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందుతున్న ఓటర్లను తరలించేందుకు ఎంత మొత్తంలో చెల్లిస్తున్నారో... ప్రయాణ ఖర్చులు ఏ మేరకు భరిస్తున్నారో తెలుసుకుంటున్నారు. గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి.వలస ఓటర్ల కోసం ఆరా తీస్తున్నారు. అంతకుమించి తాయిలాలు ఇచ్చి ఓటర్లను తెప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. దీని కోసం ఇప్పటికే ప్రత్యేకంగా బస్సులు, ఇతర వాహనాలను కూడా నడుపుతున్నారు.

పండగలా ఉండేది

పెద్దల మాట

సాలూరు రూరల్: గతంలో ఎన్నికలు పండగలా ఉండేవి. ఎన్నికల గురించి అందరూ మాట్లాడుకునే వారు. ఎవరు నిలబడ్డారు? వారు ఎలాంటోళ్లు అని గుణగణాల కోసం చర్చించే వారు. పోటీలో నిలబడినోళ్లు ఊరిలో తిరిగి ఓటు అడిగే వారు. వీధుల్లో పెద్ద మనుషులు వారి గురించి చెప్పి ఓటు వేయమనే వారు. రిక్షాల్లో వెళ్లి ఓటు వేసి వచ్చేవారం. ఇప్పుడు ఎన్నికలలో గోలగోలగా ప్రచారం చేస్తున్నారు. ఎన్నికల తీరు మారింది.

– గొట్టాపు బంగారమ్మ (78), సాలూరు



ఓట్లు ఎలా అడగాలి దేవుడా!

● పనులు చేసినా.. పరపతి పోయింది ● ఆందోళన చెందుతున్న సర్పంచ్‌లు

(విజయనగరం)



వైసీపీ ప్రభుత్వ హయాంలో వందలాది మంది సర్పంచ్‌లు అప్పుల పాలయ్యారు. వేలాది రూపాయలు అప్పుచేసి పనులు చేసినా తమ పరపతిపోయిందని వాపోతున్నారు. సర్పంచ్‌గా గెలిచి ఊరికి రోడ్లు, తదితర అభివృద్ధి పనులు చేస్తామని చెప్పి చివరకు నిధులు రాక సొంత ఆస్తులు, వ్యవసాయ భూములు అమ్ముకుని పైసా లేకుండా పోయిందని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఎన్నికలు రావడంతో ప్రజల్లోకి ఎలా వెళ్లి ఓట్లు అడగాలని మధనపడుతున్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు మాత్రం ఎలాగైనా ఈసారికి గెలిపించాలని సర్పంచ్‌లను బతిమాలుతున్నారు. వివిధ మండలాల్లోని కొందరు సర్పంచ్‌లు తమ వ్యవసాయ భూములను తాకట్టు పెట్టగా... మరి కొందరు నాయకులు రూ.లక్షల్లో అప్పులుచేసి పనులు చేపట్టారు. చేసిన పనులకు బిల్లులు రాక తీవ్రంగా ఇబ్బందిపడుతూ పరపతి తెచ్చినచోట పరువు పోతోందని వడ్డీలు కడుతున్నారు. కొందరైతే బంగారు నగలు విక్రయించి అప్పులుతీర్చారు. ఐదేళ్లుగా నాయకత్వం వహించే వారు సర్పంచ్‌లను పట్టించుకోవడంలేదు. మూడేళ్ల కిందట సర్పంచ్‌గా పోటీచేయి నీకు అండగా ఉంటామని చెప్పిన నాయకులు.. తీరా లక్షలు ఖర్చయ్యాక కనిపించడం లేదుకదా.. జరిగే పనులకు బిల్లులు వస్తాయని డాంబికాలు పలికారు. వీరి తీరుతో విసిగిపోయిన కొందరు సర్పంచ్‌లు చాపకింద నీరులా కూటమి అభ్యర్థులకు మద్దతు పలుకుతున్నారు.

అక్కడ ఇద్దరు ఎంపీలు ఎమ్మెల్యేలు

● ఒకే రోజు ఏపీ, ఒడిశాల్లో పోలింగ్ ● సందిగ్ధంలో కొఠియావాసులు
● అధిక పోలింగ్ తమ వైపే జరిగేలా ఇరు రాష్ట్రాల ప్రతినిధుల యత్నం

(సాలూరు రూరల్)

ఏ ప్రాంతానికైనా ఒక ఎంపీ, ఒక ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తారు. ఏవోబీలోని కొఠియావాసులకు మాత్రం బ్రిటిష్ కాలం నుంచి ఇరు రాష్ట్రాలకు చెందిన ప్రజాప్రతినిధులు ప్రాతినిధ్యం వహించడం విశేషం. స్వాతంత్ర్యం రాక ముందు కూడా కొఠియావాసులు అటు కలకత్తా ప్రెసీడెన్సీ, ఇటు మద్రాస్ ప్రెసిడెన్సీ పాలనలో ఉండేవారు. స్వాతంత్ర్యం అనంతరం 1952 నుంచి జరుగుతున్న ఎన్నికల్లో కొఠియావాసులకు ఏపీ నుంచి ఎమ్మెల్యే, ఎంపీ, ఒడిశా నుంచి ఎమ్మెల్యే, ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ప్రస్తుతం కొఠియావాసులకు ఏపీ నుంచి అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, సాలూరు ఎమ్మెల్యే పీడిక రాజన్నదొర ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఒడిశా నుంచి కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్కా, పొట్టంగి ఎమ్మెల్యే ప్రీతమ్ పాడీ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఏవోబీలో ఉన్న కొఠియా గ్రూప్ 21 గ్రామాల్లో ఉన్న గిరిజనులను ఇరు రాష్ట్రాలకు చెందిన వారుగా పరిగణిస్తున్నారు. వారికి రెండేసి ఓట్లు, రేషన్ కార్డులు, ఇరు రాష్ట్రాల సంక్షేమ పథకాలు, విద్య, వైద్య, వ్యవసాయ తదితర అన్ని సౌకర్యాలు అందుతున్నాయి. కొఠియావాసులు సైతం ఇరు రాష్ట్రాల పథకాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇరు రాష్ట్రాల ప్రజాప్రతినిధులకు తమ సమస్యలను చెప్పుకొని పరిష్కారం పొందడానికి ప్రయత్నిస్తారు.

ఒడిశా ముందు వరుసలో...

కొఠియాపై ఆధిపత్యానికి ఒడిశా ఒక అడుగు ముందులో ఉండి ఈ గ్రామాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ప్రస్తుతం ఏపీ, ఒడిశాల్లో అసెంబ్లీలకు, లోక్‌సభకు ఎన్నికలు జరుగుతున్నాయి. అరకు, కొరాపుట్ లోక్‌సభ, సాలూరు, పొట్టంగి అసెంబ్లీ స్థానాలకు ఇరు రాష్ట్రాల్లో ఒకే రోజు మే 13న ఎన్నికలు జరగనున్నాయి. ఏపీ నుంచి అరకు ఎంపీగా బీజేపీ తరఫున కొత్తపల్లి గీత, వైసీపీ నుంచి తనూజరాణి, సీపీఎం నుంచి పాచిపెంట అప్పలసరస తదితర 13 మంది పోటీ పడుతున్నారు. సాలూరు ఎమ్మెల్యేగా వైసీపీ నుంచి పీడిక రాజన్నదొర, టీడీపీ కూటమి అభ్యర్థిగా గుమ్మిడి సంధ్యారాణి, కాంగ్రెస్ నుంచి మువ్వల పుష్పారావు పోటీ పడుతున్నారు. కొరాపుట్ ఎంపీగా కాంగ్రెస్ నుంచి సప్తగిరి ఉల్కా, బీజేపీ నుంచి కాళిరామ్ మాఝి, బీజేడీ నుంచి కౌసల్య హిక్కాక మరో ఇండిపెండింట్ పోటీ పడుతున్నారు. పొట్టంగి ఎమ్మెల్యేగా బీజేడీ నుంచి ప్రఫుల్ కుమార్ పాంగి, కాంగ్రెస్ నుంచి రామచంద్ర కడెం, బీజేపీ నుంచి చైతన్య నందివాల మరో ముగ్గురు స్వతంత్రులు పోటీ పడుతున్నారు. కొఠియావాసులకు రెండు రాష్ట్రాలకు చెందిన ఇద్దరు ఎంపీలు, ఇద్దరు ఎమ్మెల్యేలను ఎన్నుకోనున్నారు. రెండు రాష్ట్రాల్లో ఒకే రోజు ఎన్నికలు కావడంతో ఏ రాష్ట్రానికి అధికంగా వారి మద్దతు ఉంటుందోననే ఉత్కంఠ నెలకొంది. తమ రాష్ట్రానికి అధికంగా ఓటింగ్ జరిగేలా ఒడిశా సకల ప్రయత్నాలు చేస్తోంది. ఏపీ ప్రభుత్వం కొఠియావాసుల కోసం నేరేళ్లవలస, శిఖపరువు, కురుకూటిల్లో పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసింది. ఏపీ ఓటర్ల జాబితా ప్రకారం 2,554 మంది ఓటర్లు ఉన్నారు. ఒడిశా మాత్రం వారి గ్రామాలకు సమీపంగానే కొఠియా, పగులుచెన్నారు, ముడకారు, గంజాయిభద్ర, రణసింగి, గాలిగబడారు, తావుపొదర్, గెమ్మెలపొదర్, తురియాలో పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసింది. ఒడిశా జాబితా ప్రకారం 5,502 మంది ఓటర్లు ఉన్నారు. కొఠియావాసులు స్వేచ్ఛగా తమ ఓటును వినియోగించుకోవడానికి ఇరు రాష్ట్రాలు ఏర్పాట్లు చేస్తున్నాయి.



కొఠియా గ్రామం



కొఠియా గ్రూప్ ఎగువకెంబి గ్రామం

బొబ్బిలి ఖ్యాతిని ఇనుమడింపజేస్తా

● గ్రామాలను అభివృద్ధి చేసి చూపిస్తా
● జనమంతా నా ఆత్మబంధువులే!
● టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన)

(బొబ్బిలి)

'బొబ్బిలికి చరిత్రలో ఎంతో పేరు ప్రఖ్యాతులు ఉన్నాయి. ఆ ఖ్యాతిని మరింతగా ఇనుమడింపజేసే విధంగా రాజకీయాలలో సేవలందించాలన్న లక్ష్యంతో పని చేస్తాను' అని బొబ్బిలి టీడీపీ- జనసేన-బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) అన్నారు. ఎమ్మెల్యేగా గెలుపొందితే ఏయే కార్యక్రమాలు చేపట్టాలో స్పష్టమైన అవగాహన ఉందని చెప్పారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..



బొబ్బిలి నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌వీఎస్‌కేకే రంగారావు

సంపదను సృష్టించే సత్తా బాబుకే..

నారా చంద్రబాబు నాయుడుకు ఎంతో దూరదృష్టి ఉంది. సంపదను సృష్టించే సత్తా ఆయనకే ఉంది. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ధరలు ఆకాశాన్ని తాకాయి. యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కోల్పోయారు. ఇష్టారాజ్యంగా అప్పులు వాడేశారు. ఆఖరికి రిజర్వు బ్యాంకులో ఉన్న బాండ్లను వేలం వేసే అర్హతను సైతం కోల్పోయి, రాష్ట్రానికి ఎంతో అప్రతిష్ఠను మూటగట్టారు. నా ఒక్కడి పదవి కోసం ఓటు వేయాలని కోరుకోవడం లేదు. రాష్ట్రానికి మేలు జరగాలన్న దృక్పథంతో ఓటును వినియోగించుకోవాలి.

సొంత గడ్డకు సేవ చేయాలని వచ్చా

బాల్య దశలోనే నాకు బొబ్బిలిపై వల్లమాలిన అభిమానం. విజయనగరం జిల్లా కరువు ప్రాంతం. అన్నిటా వెనుకబడిన ప్రాంతం. మా తాతగారు ఆర్‌ఎస్‌ఆర్‌కే రంగారావు ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఈ ప్రాంతంలో విద్య, ఇరిగేషన్ పరంగా విశేష సేవలందించారు. ఆయన స్ఫూర్తితో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించాం. ప్రతి గ్రామంలో మా మార్కు సేవకు చిహ్నంగా అనేక ఆనవాళ్లు కనిపిస్తుంటాయి. పేదల కోసం ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లను వైసీపీ ప్రభుత్వం చంద్రబాబుపై కోపంతో పూర్తిగా మూసివేసింది. దీనితో అన్నార్తులంతా ఎంతో ఇబ్బందులు పడ్డారు. వారి కోసం సొంత డబ్బుతో అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నాం. రామభద్రపురం మండల కేంద్రంలో రైతుల కోసం అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేశాం. ఈ రాష్ట్రాన్ని జగన్ బీహార్ కన్నా అధ్వానంగా తయారు చేశాడు. ఆయన మాత్రం అన్ని ప్రాంతాలలో ప్యాలెస్‌లు కట్టించుకొని రూ.కోట్లు గడించాడు. ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నాడు. ఓటు హక్కు పొందినవారంతా జాగృతులై రాష్ట్ర భవిష్యత్ కోసం విచక్షణతో వ్యవహరించాలి.

గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం

జగన్ పాలనలో గంజాయి, డ్రగ్స్ మాఫియా పెరిగిపోయింది. దీనిని పూర్తి స్థాయిలో అరికట్టకపోవడంతో దేశానికి పెద్ద సంపద అయిన యువత పూర్తిగా నష్టపోతున్నారు. ఆరోగ్యానికి ప్రమాదకరంగా మారిన నకిలీ మద్యాన్ని పారదోలి నాణ్యమైన మద్యం సరఫరా చేస్తాం. బొబ్బిలి పట్టణంలో అత్యాధునిక వసతులతో లైబ్రరీకి హంగులు కల్పిస్తాం. ప్రతి మండల కేంద్రంలో స్టడీ సర్కిల్స్‌ను ఏర్పాటు చేస్తాం. పాడైన రోడ్లకు టీడీపీ-జనసేన ప్రభుత్వ హయాంలో మహర్దశ ఉంటుంది. మాజీ సైనికోద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి.. పరిష్కారానికి కృషి చేస్తాను.

పరిశ్రమలకు ఊపిరి పోస్తాం

బొబ్బిలి ఏపీఐఐసీ గ్రోత్ సెంటరులో పరిశ్రమల ఏర్పాటు ముమ్మరం చేసి ఈ ప్రాంత ప్రజల కలలను సాకారం చేసేందుకు కృషి చేస్తాను. ఇందుకోసం అవసరమైన పారిశ్రామిక విధానం, విద్యుత్ పాలసీని ఎన్‌డీఏ కూటమి పకడ్బందీగా అమలు చేస్తుంది. మూతపడిన పరిశ్రమలను తెరిపించేందుకు కృషి చేస్తా. చక్కెర కర్మాగారాన్ని నిర్వహించగలిగే సమర్థవంతమైన సంస్థలకు అప్పగించేందుకు కృషి చేస్తాను. ప్రభుత్వ సాయాన్ని అర్థిస్తాం. రైతులకు, కార్మికులకు మేలు చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తాం. ఇందులో రాజీ లేదు. అంతర్రాష్ట్ర ప్రాంతాలకు అనుసంధానంగా ఉన్న పారాది వేగావతి నదిపై బ్రిడ్జిని మా తాతగారి హయాంలో నిర్మించారు. బ్రిటీషు కాలం నాటి ఆ బ్రిడ్జి పూర్తిగా పాడైపోవడంతో మా సోదరుడు సుజయ్‌కృష్ణరంగారావు మంత్రిగా ఉన్నప్పుడు తెలుగుదేశం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇప్పటికీ దాని పనులు ప్రారంభం కాలేదు.

తాగు, సాగునీటికి ప్రాధాన్యం

లోచర్ల, రాముడువలస తోటపల్లి ఎత్తిపోతల పథకాలను మూలకు చేర్చారు. వైసీపీ హయాంలో ఇరిగేషన్ రంగాన్ని పూర్తిగా ధ్వంసం చేశారు. అధికారంలోనికి రాగానే తాగునీటి, సాగునీటి వనరులకు పెద్దపీట వేస్తాం. ప్రభుత్వ పరంగా జూనియర్, డిగ్రీ కళాశాలల ఏర్పాటుకు కృషి చేస్తాం. ఎన్టీఆర్ ప్రారంభించిన ప్రభుత్వ గురుకుల పాఠశాలలను అభివృద్ధి చేస్తాం. చరిత్రాత్మకమైన ఐటీఐని అభివృద్ధి చేస్తాం. టిడ్కో ఇళ్లన్నిటినీ లబ్ధిదారులకు అప్పగిస్తాం. అక్కడ మౌలిక సదుపాయాలు కల్పిస్తాం.

అందరూ సమాన పౌరులే

ప్రజాస్వామ్య వ్యవస్థలో పౌరులందరూ సమానమే. పేద-గొప్ప అనే తేడా లేదు. రాజుకు-రైతుకు జరుగుతున్న పోటీ అని చెప్పి ప్రజల్లో లేనిపోని భావాలను సృష్టించడానికి ప్రత్యర్థులు పన్నాగాలు చేస్తున్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల ప్రజలు నన్ను, మా కుటుంబాన్ని ఆత్మబంధువులుగానే చూసుకుంటున్నారు. రైతు, వ్యవసాయం అంటే ఏమిటో తెలియని వారు సైతం వీటి గురించి చెప్పుకోవడం సిగ్గు చేటు. జనం మనిషిగా బేబీనాయన ముద్రపడిపోవడంతో ప్రత్యర్థులు చీప్ ట్రిక్స్ చేసేందుకు నానా తంటాలు పడుతున్నారు. ఏ ఊరు వెళ్లినా అభిమానులు, పార్టీ కార్యకర్తలు ఉప్పొంగిన ఉత్సాహంతో ఆదరిస్తున్నారు. బొబ్బిలిలో తెలుగుదేశం పార్టీ విజయపతాకను ఎగురవేయడం ఖాయం.

పాతకు చెల్లుచీటీ.. కొత్తబాట పట్టి!

● ఎన్నికల ప్రచారంలో పెనుమార్పులు
● ఆటో ప్రచారాలు నామమాత్రం
● గోడలపై రాతలకు కాలం చెల్లు
● కరపత్రాల ఊసు లేదు
● ఇంటింటికీ తిరిగడం పైనే అభ్యర్థుల ఆసక్తి

(చీపురుపల్లి)

ఎన్నికల ప్రచారం తీరు పూర్తిగా మారిపోయింది. గతంలో జరిగిన ప్రచారాలతో పోలిస్తే అభ్యర్థులు కొత్త విధానాలను అనుసరిస్తున్నారు. ప్రచారం పట్ల ప్రజల్లో అంతగా ఆసక్తి కనిపించకపోవడం ఒక కారణమైతే... మరో వైపు వ్యయ పరిమితి గరిష్ట స్థాయిని దాటిపోకూడదన్న ఉద్దేశంతో అభ్యర్థులు ఆచి తూచి అడుగులేస్తున్నారు. దీంతో ప్రచారంలో పాత పద్ధతులు కనుమరుగవుతున్నాయి. గతంలో నామినేషన్ల ఘట్టం ముగిసినప్పటి నుంచీ పోలింగ్ ముందు రోజు వరకూ ప్రధాన పార్టీల నాయకులు ప్రచారాన్ని హోరెత్తించేవారు. ఒకప్పుడు.. అంటే సుమారు నాలుగు దశాబ్దాల కిందట ఇనుప రేకులతో తయారు చేసిన ప్రింట్‌లపై, నీలి మందు రాసి గోడలపై అచ్చులు వేసేవారు. దీనిపై అభ్యర్థి పేరు, ఎన్నికల గుర్తు ఉండేవి. పోలింగ్ తేదీని కూడా ఎక్కువ ప్రచారం చేసేవారు. చాలా కాలం తరువాత ఈ విధానానికి స్వస్తి పలికారు. ఆ తరువాత, మండల కేంద్రాల్లో ఎన్నికల కార్యాలయాలు ప్రారంభించి, ఉదయం నుంచి రాత్రి వరకూ మైకులతో గోల పుట్టించేవారు. మండల పరిధిలోని గ్రామాలకు పార్టీ జెండాలు, టోపీలు, బ్యానర్లు,ఇతర ఎన్నికల ప్రచార సామగ్రి ఈ కార్యాలయాల నుంచే పంపిణీ చేసేవారు. ఇవన్నీ కాకుండా ఒక్కో పార్టీ నుంచి కనీసం పది నుంచి పదిహేను వరకూ ఆటోలు, రిక్షాలు ఏర్పాటు చేసుకొని ఏ గ్రామాన్నీ, ఏ వీధినీ వదిలి పెట్టకుండా తిరిగేవారు. వేలాదిగా కరపత్రాలు పంచేవారు. గోడ పత్రికలు కూడా ముద్రించి అంటించేవారు. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా గోడలు ఖాళీగా కనిపిస్తే.. అభ్యర్థుల పేర్లను రాసి ప్రచారం చేసేవారు.



వ్యయంపై ఆంక్షలతో...

ప్రస్తుతం ప్రచారంలో ఆ హడావుడి కనిపించడం లేదు. కనీసం 2014 ఎన్నికల నాటి ప్రచారాల స్పీడు కూడా ప్రస్తుతం కానరావడం లేదు. వ్యయ పరిమితిపై ఎన్నికల కమిషన్ విధించిన నిబంధనలు దీనికి ప్రధాన కారణం. ఈ తరహా ఎన్నికల ప్రచారాలపై ప్రజలకు ఆసక్తి తగ్గడం కూడా ఒక కారణంగా కనిపిస్తోంది. లక్షలాది రూపాయలు వెచ్చించి ప్రచారం ఏ స్థాయిలో చేసినా... ఆఖరి రోజుల్లో చాప కింద నీరులా సాగే పంపిణీపైనే అభ్యర్థులు ఎక్కువగా నమ్మకం పెట్టుకోవడమే దీనికి ప్రధాన కారణం. దీంట్లో భాగంగా అభ్యర్థులు తమ ప్రచారంలో కొత్త పంథాను అనుసరిస్తున్నారు. డబ్బులు వెచ్చించి, మైకు సెట్లలో హోరెత్తించడం కంటే ఇంటింటి ప్రచారంపైనే మొగ్గు చూపిస్తున్నారు. ఇప్పటి వరకూ తమ హయాంలో జరిగిన పనులను అధికార పార్టీ నాయకులు, అభ్యర్థులు ప్రజలకు వివరిస్తుండగా.. ప్రతి పక్షం నుంచి పోటీకి నిలబడిన నాయకులు భవిష్యత్తులో తాము అధికారంలోకి వస్తే ఏం చేస్తామో వివరిస్తున్నారు. కొంతమంది అభ్యర్థుల తరఫున ప్రచారం చేస్తున్న మహిళలు ప్రశాంతంగా గ్రామాల్లోకి వెళ్లి... మహిళా ఓటర్ల నుదుటన తిలకం దిద్ది.. ఓట్లు అడుగుతున్నారు. పార్టీ అధినాయకులు వచ్చిన సందర్భాల్లో తప్ప బహిరంగ సభలు, రోడ్ షోలు నిర్వహించడం లేదు. ఇది ఇలా ఉండగా.. ప్రచారంలో వచ్చిన మార్పులు కొంతమంది వృత్తిదారుల ఉపాధి అవకాశాలను దెబ్బ తీశాయి.

అన్నీ ఫోన్‌లో వద్దులే.. వాట్సాప్ కాల్ చేస్తా..!

([illegible])

[illegible] గురవుతున్నారు. ఫోన్ కాల్ కంటే వాట్సాప్ కాల్ ఉత్తమమని భావించిన అనేకమంది ఈ విధానాన్నే పాటిస్తున్నారు. ప్రస్తుతం రాజకీయంగా పలుకుబడి ఉన్నవారు, ఉన్నతాధికారులు, ఉద్యోగులు వాట్సాప్ కాల్‌తోనే ఎక్కువ మాట్లాడుకుంటున్నారు.



9 జిల్లాలు దాటి వచ్చి ఓటు వేసి..

పాలకొండ, మే 8: పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండకు చెందిన ఉత్తరాంధ్ర ఉద్యోగ సంఘాల నాయకుడు భరత్ భూషణ్‌రాజ్ సతీమణి కావూరు రాజశ్రీ ఏలూరులో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. కొన్ని కారణాలు కారణంగా ఆమెకు బ్యాలెట్ ఓటు ఏలూరుకు ట్రాన్స్‌ఫర్ కాలేదు. దీంతో ఆమె ఎన్నికల విధుల శిక్షణ పూర్తి చేసుకుని బుధవారం బయలుదేరి పాలకొండ చేరుకున్నారు. ప్రజాస్వామ్యం తనకు కల్పించిన ఓటును బాధ్యత ఉన్న పౌరురాలిగా పాలకొండలో ఓటేసి తిరిగి ఏలూరు ప్రయాణమయ్యారు.



ఓటు వేసిన రాజశ్రీ

430 కిలోమీటర్లు దాటి ప్రయాణం

ఆమె 430 కిలోమీటర్ల దూరం సుమారు 9 గంటలు ప్రయాణం చేసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఏలూరు, పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి, కాకినాడ, అనకాపల్లి, విజయనగరం, అల్లూరి సీతారామ రాజు, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లా మీదుగా పార్వతీపురం మన్యం జిల్లాకు చేరుకున్నారు.



- ద్వితీయ శ్రేణి నాయకత్వంపై కన్ను
- వారిని ప్రసన్నం చేసుకునే పనిలో అభ్యర్థులు
- ఓటర్లను ప్రభావితం చేయగలిగే వారికి పెద్దపీట

వీరే ముఖ్యం!

(శృంగవరపుకోట)

...ఇలా ఎన్నికల్లో అతితక్కువ ఓట్లతో జయాపజయాలు పొందిన వారెందరో ఉన్నారు. గతంలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో అనకాపల్లి ఎంపీ కేవలం తొమ్మిది ఓట్లు తేడాతో గెలిపొందిన చరిత్ర ఉంది. దీనిని బట్టి ఓటు విలువను తెలుసుకోవచ్చు. ఇది సామాన్య జనాలకు పెద్దగా అర్థం కాకపోవచ్చు. బరిలో నిలిచే నేతలకిది బాగా తెలుసు. ఇలా చేయడంలో కీలక పాత్ర పోషించింది ద్వితీయ శ్రేణి నాయకత్వం. అందుకే ఇప్పుడు అభ్యర్థుల కన్ను ద్వితీయ శ్రేణి నాయకులపై పడింది. వారిని ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు.

నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే పతివాడ నారాయణ స్వామినాయుడు 2009లో తప్ప ఓటమే ఎరుగని నేత. అప్పుడు కూడా కేవలం 597 ఓట్ల తేడాతోనే ఓటమి చెందారు. రద్దయిన భోగాపురం నియోజకవర్గం నుంచి ఆయన వరుసగా ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు.

శృంగవరపుకోట శాసన సభకు ప్రాతినిధ్యం వహించిన ఎల్‌బీ దుక్కును మైదాన ప్రాంతాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు 1999లో వ్యతిరేకించారు. దీంతో అతని స్థానంలో శోభా హైమావతికి టీడీపీ టికెట్ ఇచ్చింది. ఆమె కేవలం 678 ఓట్ల మెజార్టీతో గట్టెక్కారు.

తాయిలాలు ఇచ్చేందుకు...


మరో ఐదు రోజుల్లో సార్వత్రిక ఎన్నికలు జరగబోతున్నాయి. దీంతో మండుటెండలో కూడా అభ్యర్థులు ఉదయం నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రచారంలో ఉంటున్నారు. ఓవైపు ఇలా ప్రచారం చేస్తూనే.. మరో వైపు ద్వితీయ శ్రేణి నాయకులతో సమావేశమవుతున్నారు. గ్రామ, మండల స్థాయి నేతలతో భేటీ అవుతున్నారు. తమ వైపు పనిచేసేలా ఒప్పించుకొనేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకు వారేమడిగినా ఇచ్చేందుకు సిద్ధపడుతున్నారు. ప్రత్యర్థి పార్టీలకు చెందిన వ్యక్తులను తమ వైపు తిప్పుకొనేందుకు చూస్తున్నారు. తమ పార్టీకి చెందిన నేతలతో తరచూ సమావేశమవుతున్నారు. సామాజిక వర్గాలవారీగా పది, ఇరవై ఓట్లు తేగలిగిన నేతలతోనూ ప్రత్యేకంగా కూర్చొంటున్నారు. ఉదాహరణకు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సతీమణి బొత్స ఝాన్సీలక్ష్మి విశాఖ పార్లమెంట్ నుంచి వైసీపీ అభ్యర్థిగా రంగంలో ఉన్నారు. శృంగవరపుకోట శాసనసభ ఈ నియోజకవర్గం పరిధిలో ఉంది. దీంతో గతంలో ద్వితీయ శ్రేణి నాయకులకు ముఖం కూడా చూపించని ఆయన ఇప్పుడు పది ఓట్లు కూడా లేని వార్డు సభ్యులకు ఫోన్ చేసి మాట్లాడుతున్నారు. స్వయంగా ఇంటికి రప్పించుకుంటున్నారు. ద్వితీయ శ్రేణి నాయకులకున్న బలమిదేమరి. వైసీపీ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత పూర్తిస్థాయిలో కనిపిస్తోంది. టీడీపీ వైపు ఓటు తరలితుందన్న నిర్ణయానికి వచ్చిన అధికార పార్టీ అభ్యర్థులకు ఓటు బ్యాంకును నిలబెట్టుకొనేందుకు ఇప్పుడు ద్వితీయ శ్రేణి నేతలు దిక్కయ్యారు. వారిని తమవైపు తిప్పుకునేందుకు శతవిధాలా ప్రయత్నాలు చేస్తున్నారు.



ఎస్.కోట మండలం బొడ్డవరలో ద్వితీయ శ్రేణి నేతలతో టీడీపీ ఆత్మీయ సమావేశం (ఫైల్)

అన్నిచోట్లా అలాగే...

ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుకు.. ఎస్.కోట ఎమ్మెల్యే కె.శ్రీనివా సరావుకు మధ్య విభేదాలు ఉన్నాయి. మళ్లీ ఆయనకే టికెట్ ఇస్తే పనిచేయనని ఎమ్మెల్సీ బహిరంగంగానే చెప్పేవారు. అయినా వైసీపీ అధిష్ఠానం పట్టించుకోలేదు. దీంతో అతని వెనకున్న ద్వితీయ శ్రేణి నేతలంతా టీడీపీలోకి వెళ్లిపోయారు. ఇదే నియోజకవర్గంలో ఎన్ ఆర్‌ఐ గొంప కృష్ణ టీడీపీ నుంచి టికెట్ ఆశించారు. పార్టీ నిరాకరించడంతో ఇండిపెండింట్‌గా పోటీ చేసేందుకు సిద్ధపడ్డారు. గెలుపుపై ప్రభావం పడే అవకాశం ఉండడంతో పార్టీ అధినాయకత్వం నచ్చజెప్పి పోటీ చేయకుండా నివారించింది. అతనితో పాటు మరికొంత మంది ద్వితీయ శ్రేణి నేతలను ఒప్పించి పార్టీ గెలుపునకు సహకరించేలా ఒప్పించింది. గజపతినగరం నియోజకవర్గంలోనూ మాజీ ఎమ్మెల్యే కేఏ నాయుడుకు టీడీపీ అధిష్ఠానం టికెట్ ఇవ్వలేదు. దీంతో అతను పార్టీ మారే ఆలోచన చేశారు. ప్రజాగళం యాత్రకు వచ్చిన అధినేత చంద్రబాబు బుజ్జగించడంతో పార్టీని గెలిపించేందుకు నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. చీపురుపల్లి నియోజకవర్గంలో కిమిడి నాగార్జునకు టికెట్ ఇవ్వకుండా అతని పెదనాన్న, సీనియర్ నేత కిమిడి కళా వెంకటరావుకు పార్టీ టికెట్ కేటాయించింది. దీంతో నాగార్జున అలిగారు. అతడిని చంద్రబాబు పిలిపించుకొని మాట్లాడారు. నెల్లిమర్ల నియోజకవర్గం పొత్తులో భాగంగా జనసేనకు వెళ్లింది. దీంతో అక్కడ టీడీపీ నుంచి టికెట్ ఆశించిన కర్రోతు బంగార్రాజు కినుక వహించారు. పొత్తు ధర్మాన్ని పాటించాలని అధినేత చంద్రబాబు నచ్చజెప్పడంతో దారికి వచ్చారు. వీరంతా వేలకు వేలు ఓట్లు కలిగి ఉన్న నాయకులు, అటు నుంచి ఇటు తిప్పేయగల సమర్థత ఉన్నవారు. వీరి వెనకున్న ద్వితీయ శ్రేణి నేతల ఆలోచన మారితే.. అభ్యర్థుల తలరాతలు మారిపోవడం ఖాయం. అందుకే వారెవ్వరూ బయటకు పోకుండా పార్టీ కాపాడి అభ్యర్థులకు అప్పగించింది. ఇప్పుడు అభ్యర్థులు వీరిని, వీరి అనుచర గణాన్ని ఓ కంట కనిపెట్టుకుంటూ, ప్రత్యర్థి పార్టీలో ఉన్న ద్వితీయ శ్రేణి నేతలను రాబట్టుకొనే పనిలో పడ్డారు. సొంత పార్టీలో ఉన్నా ఇంతవరకు సఖ్యత లేకపోయినా.. ఇప్పుడు వారి వద్దకు వెళ్లి దగ్గర చేసుకునే ప్రయత్నంలో పడ్డారు.



కుగ్రామం నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలు



కిమిడి కళావెంకటరావు



కిమిడి గణపతిరావు



కిమిడి మృణాళిని

(రేగిడి)

రేగిడి మండలానికి రాష్ట్ర రాజకీయాల్లో ఓ ప్రత్యేకత ఉంది. మండల కేంద్రం రేగిడి గ్రామం నుంచి రాష్ట్రనేతలను అందించిన చరిత్ర ఉంది. ఈ గ్రామం నుంచి ముగ్గురు రాష్ట్ర శాసనసభకు ప్రాతినిధ్యం వహించారు. అంతేకాక రాష్ట్ర మంత్రులుగా పనిచేసిన నేపథ్యం ఉంది. వీరంతా కిమిడి కుటుంబీకులే కావటం గమనార్హం. వీరిలో కిమిడి కళా వెంకటరావు, ఆయన సోదరుడు కిమిడి గణపతిరావు, గణపతిరావు భార్య కిమిడి మృణాళినిలు ఉన్నారు. కళా వెంకటరావు ప్రస్తుతం చీపురుపల్లి అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉన్నారు. గతంలో ఐదుసార్లు ఎమ్యేల్యేగా ఎన్నికయ్యారు. ఆయన కేబినెట్ మంత్రిగా.. టీటీడీ చైర్మన్‌గా.. రాజ్యసభ సభ్యునిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన సోదరుడు గణపతిరావు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ఉణుకూరు నుంచి 1999లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. గణపతిరావు భార్య కిమిడి మృణాళిని 2014లో చీపురుపల్లి నుంచి పోటీ చేసి బొత్స సత్యనారాయణపై గెలుపొందారు. ప్రస్తుతం గణపతిరావు దంపతులు క్రియాశీలక రాజకీయాల్లో లేకపోయినా వారి కుమారుడు కిమిడి నాగార్జున చురుగ్గా పని చేస్తున్నారు.

రాజాం సమగ్ర అభివృద్ధే ధ్యేయం

- తాగు, సాగునీటి సమస్యలు పరిష్కరిస్తా
- ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేలా చర్యలు
- టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి కోండ్రు మురళీమోహన్



రాజాం నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కోండ్రు మురళీమోహన్

రాజాం: రాజాం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానని కూటమి అభ్యర్థి, మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్ స్పష్టం చేశారు. గత రెండు ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థికి ఓటు వేసిన ప్రజలు తప్పు చేశామని పశ్చాత్తాప పడుతున్నారని అన్నారు. గత ఐదేళ్లుగా వైసీపీ పాలనలో రాజాం నియోజకవర్గ ప్రజలు దారుణ వంచనకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. 2009లో తొలిసారిగా రాజాం నియోజకవర్గ ఎమ్మెల్యేగా, మంత్రిగా తన సేవలను గుర్తు చేసుకొని ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. రాజాం మునిసిపాల్టీతో పాటు రాజాం, సంతకవిటి, రేగిడి ఆమదాలవలస, వంగర మండలాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్టు తెలిపారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

పట్టణాభివృద్ధికి ప్రణాళిక

రాజాం... ఉమ్మడి శ్రీకాకుళంతో పాటు నేటి విజయనగరం జిల్లాలో మంచి పట్టణం. అభివృద్ధికి అవకాశం ఉన్న పట్టణం. కానీ గత పదేళ్లలో వైసీపీ ఎమ్మెల్యే ఎటువంటి అభివృద్ధి చేయలేకపోయారు. నేను మంత్రిగా ఉన్న సమయంలోనే రాజాం పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందిన విషయాన్ని గుర్తుచేసుకోవాలి. గత ఐదేళ్లుగా రోడ్డు విస్తరణ పేరుతో కాలయాపన జరిగిందే కానీ.. అభివృద్ధికి ఎటువంటి ముందడుగు పడలేదు. అందుకే ఎమ్మెల్యేగా ఎన్నికైన మరుక్షణం రాజాం పట్టణాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలు చేస్తా. అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తా.

పక్కా రహదారులకు...

నియోజకవర్గంలో రహదారుల సమస్య తీవ్రంగా ఉంది. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు వాణిజ్య కేంద్రంగా ఉన్న రాజాంలోనే రహదారులు బాగాలేవు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో లింకు రహదారులు ఉన్నాయి. అటు ప్రధాన రహదారులు సైతం అస్తవ్యస్తంగా ఉన్నాయి. వాటిని బాగుచేసేందుకు నడుం కడతా. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి పక్కా రహదారులు ఏర్పాటు చేస్తా.

సాగు..తాగునీటికి...

జిల్లాలో ఎక్కడా లేని సాగు, తాగునీటి వనరులు రాజాం నియోజకవర్గంలో ఉన్నాయి. తోటపల్లి, మడ్డువలస రిజర్వాయర్లతో పాటు నారాయణపురం ఆనకట్టకు సంబంధించి సాగునీటి కాలువలను ఆధునీకరిస్తాం. నియోజకవర్గంలోని శివారు ఆయకట్టుకు సాగునీరు అందిస్తాం. రాజాం పట్టణానికి తాగునీటి ఇబ్బంది లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో ప్రత్యేక ప్రాజెక్టులను తీసుకొస్తా.

వైద్య సేవలపై...

రాజాం ప్రభుత్వాస్పత్రిలో వసతులు మెరుగుపరుస్తా. నేను వైద్యారోగ్య శాఖ మంత్రిగా ఉన్న సమయంలోనే ఆస్పత్రి అప్‌గ్రేడ్ అయిన విషయం గుర్తించాలి. ఏరియా ఆస్పత్రిగా.. ఈ ప్రాంతీయులకు సంజీవినిలా మార్చుతా. ఆస్పత్రుల్లో అదనపు భవన నిర్మాణాలతో పాటు వైద్యుల నియామకానికి కృషి చేస్తా. ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు అందించడమే నా లక్ష్యం. ఎమ్మెల్యేగా ఎన్నికైన వెంటనే ఆసుపత్రిలో పూర్తి స్థాయిలో వైద్యులు, సిబ్బందితో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటాను. ప్రత్యేక వైద్య నిపుణుల ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు వైద్యసేవలు అందిస్తాం. ఇక్కడికి వచ్చిన రోగులకు వేరే ఆసుపత్రికి రిఫరల్ అన్నది లేకుండా అవసరమైన వైద్యసేవలు అందించేలా ప్రతి విభాగానికి వైద్య నిపుణులను నియమించేలా చర్యలు తీసుకుంటాను.

అందుబాటులో ఉంటా

ఎమ్మెల్యేగా గెలిపిస్తే అందరికీ అందుబాటులో ఉంటా. ప్రజలకు అంకిత భావంతో సేవలు చేస్తా. ఏ సమస్య వచ్చినా ప్రజలకు అండగా ఉంటాను. 24 గంటలూ ఏ సమయంలో అయినా నా దగ్గరకు రావచ్చు. ప్రజలకు సేవలు అందించడమే నా లక్ష్యం.

ఆదర్శంగా తీర్చిదిద్దుతా

నా ప్రాణం ఉన్నంత వరకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు రుణపడి ఉంటాను. నియోజకవర్గ నాయకులు, ప్రజలతో పాటు జనసేన, బీజేపీ నాయకులు కూడా నా విజయం కోసం ఎంతగానో శ్రమిస్తున్నారు. ఈ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలవబోతున్నాను. రాష్ట్ర భవిష్యత్ కోసం నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎంతో కష్టపడుతున్నారు. జిల్లాలోని రాజాం నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా.

పరిశ్రమలను తెరిపిస్తా...

రాజాం నియోజకవర్గంలో మూతపడిన పరిశ్రమలను తెరిపించే ప్రయత్నం చేస్తా. సరైన ప్రోత్సాహం లేక పరిశ్రమలు మూతపడ్డాయి. వేలాది మంది కార్మికులు వీధిన పడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడి వాటికి ప్రోత్సాహకాలు అందేటట్టు చేస్తా. నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా పనిచేస్తా. అందుకే ప్రజలు నాకొక అవకాశం ఇవ్వాలని కోరుతున్నా.

కూటమి అభ్యర్థుల విస్తృత ప్రచారం

సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు దూసుకుపోతున్నారు. పల్లెలు, పట్టణాల్లో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. బుధవారం వివిధ నియోజకవర్గాల అభ్యర్థులు ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వీరి ప్రచారానికి జనం నుంచి మంచి స్పందన లభిస్తోంది. జియ్యమ్మవలస మండలం అల్లువాడలో కురుపాం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జగదీశ్వరి, సాలూరులో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సంధ్యారాణి, సీతానగరం మండలంలో పార్వతీపురం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయచంద్ర ప్రచారం చేశారు. గుర్ల మండలంలో చీపురుపల్లి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కిమిడి కళా వెంకటరావు, డెంకాడ మండలంలో నెల్లిమర్ల జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి నాగమాధవి, విజయనగరం మండలం లంకాపట్టణంలో టీడీపీ అభ్యర్థి అదితి, బాడంగి మండలంలో బొబ్బిలి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన, రాజాం మండలంలో కోండ్రు మురళి సతీమణి శ్రీలక్ష్మి ఇంటింటా ప్రచారం చేశారు.



గుర్ల: మహిళలతో కలసి అభివాదం చేస్తున్న కిమిడి కళావెంకటరావు



బాడంగి: ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు ప్రచారం



విజయనగరం: లంకాపట్టణంలో ప్రచారం చేస్తున్న అదితి గజపతిరాజు



సీతానగరం: ప్రచారంలో పాల్గొన్న విజయచంద్ర



సాలూరు: కూటమి అభ్యర్థి సంధ్యారాణికి హారతులిస్తున్న మహిళలు



జియ్యమ్మవలస: అల్లువాడలో కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి జగదీశ్వరి ప్రచారం



డెంకాడ: మాట్లాడుతున్న కూటమి నెల్లిమర్ల అభ్యర్థి నాగమాధవి



రాజాం: ఇంటింటి ప్రచారం చేస్తున్న కోండ్రు మురళి సతీమణి శ్రీలక్ష్మి

మీ ఆడపడుచును ఆశీర్వదించండి

● కూటమి కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి జగదీశ్వరి



జోగులడుమ్మలో జగదీశ్వరికి ఘన స్వాగతం పలుకుతున్న ప్రజలు

జియ్యమ్మవలస: 'మీ ఇంటి ఆడపడుచుగా వచ్చాను.. నన్ను ఆశీర్వదించి మీ అమూల్యమైన ఓటు సైకిల్ గుర్తుపై వేసి నన్ను గెలిపించండ'ని కూటమి కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి కోరారు. మండ లంలోని కన్నపుదొరవలస, ఎం.అల్లువాడ, తుంబలి, జోగులడుమ్మ పంచాయతీ లలో ఆమె బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దత్తి లక్ష్మణరావు, నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు ఎ.మహేష్, అరకు పార్లమెంటు నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణలతో కలిసి ఆమె ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కన్నపుదొరవలస, పిప్పలభద్ర గ్రామాల నుంచి వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ● **గరుగుబిల్లి:** కూటమి అభ్యర్థులను గెలిపించాలని టీడీపీ అరకు బీసీ సెల్ అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి సత్యనారాయణ కోరారు. ఈ మేరకు చిలకాం గ్రామంలో ఆయన బుధవారం మాట్లాడారు. ఈనెల 13న జరగనున్న ఎన్నికల్లో అరకు పార్లమెంటు అభ్యర్థి కొత్తపల్లి గీతను, కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరిలను గెలపించాలని కోరారు. టీడీపీ ప్రతినిధులు వై.నారాయణరావు, జి.కృష్ణ, డి.స్వామినాయుడు, బి.మోహన్‌రావు, బి.ధనుంజయరావు, గౌరునాయుడు, శివున్నాయుడు, ఈశ్వరరావు, మాజీ ఎంపీపీ గౌరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తా

● కూటమి సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి సంధ్యారాణి



సంధ్యారాణి, భంజ్‌దేవ్ సమక్షంలో టీడీపీలో చేరిన సన్యాసిరాజు, రవికుమార్

సాలూరు: 'మీ ఇంటి ఆడపిల్లగా ఒక్క అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తా'నని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో ఆమె బుధవారం ప్రచారం నిర్వహించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు. ● సాలూరు పట్టణంలోని ఆరో వార్డులో సాలూరు జమిందార్ యువరాజు విక్రమ్‌చంద్ర సన్యాసిరాజు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆయన తో పాటు వైసీపీకి చెందిన యువ నాయకుడు కిలారి రవికుమార్, పలువురు టీడీపీలో చేరారు. వారిని సంధ్యారాణి, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్పీ భంజ్‌దేవ్ పార్టీ కండువా వేసి, ఆహ్వానం పలికారు. ● అనంతరం ఆమె తన నివాసం వద్ద విలేకర్ల సమావేశం ఏర్పాటుచేసి, మాట్లాడారు. టీడీపీ హయాంలో వంద పడకల ఆసుపత్రి మంజూరైతే ఈ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో కనీసం పనులు పూర్తి చేయలేదని ఆమె ఆరోపించారు. మూడు సాగునీటి ప్రాజెక్టులకు జైకా నిధులు తెస్తే కనీసం 20 శాతం కూడా ఖర్చు చేయలేదన్నారు. అప్పట్లో రూ.4కోట్లతో తాగునీటి ట్యాంకులు ఏర్పా టు చేశానని, పాచిపెంటలో రూ.3కోట్ల 50 లక్షలతో ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేశానని తెలిపారు. ● **మక్కువ:** కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మడి సంధ్యారాణి, ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీతలను గెలిపించాలని కోరుతూ చెముడు గ్రామంలో బుధవారం టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు పెంట తిరుపతిరావు ప్రచారం చేశారు. పార్టీ నాయకులు చొక్కాపు బుచ్చినాయుడు, చింతల గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

24 గంటలూ అందుబాటులో ఉంటా

● కూటమి పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థి విజయచంద్ర



అప్పయ్యపేటలో ఎడ్లబండి మీద ప్రచారం చేస్తున్న విజయచంద్ర

సీతానగరం: తాను పార్వతీపురం నియోజకవర్గ ప్రజలకు 24 గంటలూ అందుబాటులో ఉంటానని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బోనెల విజయచంద్ర అన్నారు. సీతానగరం మండలంలోని పెదభోగిల, దయానిధిపురం, కాశీపేట పంచాయతీల్లోని గ్రామాల్లో ఆయన బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్యంనాయుడు, వేణుగోపాల్ నాయుడు ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలపై వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో క్రీడామైదానం ఏర్పాటు చేస్తానని, ఇంటి వద్దకే ప్రజాపాలన చేస్తానని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. వచ్చేది కూటమి ప్రభుత్వమేనని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరూ సైకిల్ గుర్తుపై ఓటువేసి, తనను గెలిపించాలని ఆయన కోరారు. ఈ ప్రచారంలో అడుగడుగునా ఆయనకు ఘన స్వాగత లభించింది. ఈ కార్యక్రమంలో పెదభోగిల సర్పంచ్ తేరిజమ్మ, గరికయ్య, వైస్ సర్పంచ్ కె.అరవింద్, సీనియర్ నాయకులు హరిబాబు, కాశీపేటకు చెందిన వెంకట అప్పలనాయుడు, శేఖర్, తిరుపతి, దయానిధిపురం సర్పంచ్ రామారావు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు కొమ్మ

● నాలుగు గంటలపాటు రాకపోకలకు అంతరాయం



రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న చెట్టుకొమ్మ

భామిని: మండలంలోని సింగిడి-పసుకుడి మధ్యలో రోడ్డుపై మర్రిచెట్టు కొమ్మ పడి నాలుగు గంటలు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. బుధవారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో భారీ కొమ్మ విద్యుత్ వైర్లుపై పడింది. వైర్లు నేల మట్టమయ్యాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. విద్యుత్‌శాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇంతలోగా బత్తిలి పోలీసులకు సమాచారం అందడంతో జేసీబీలు ఏర్పాటు చేసి కొమ్మను అక్కడ నుంచి తొలగించారు. నాలుగు గంటల పాటు ఇరువైపులా వాహనాలు నిలిచిపో యాయి. ప్రయాణికులు వేరే వాహనాల్లో వెళ్లేందుకు ప్రయత్నించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

పార్వతీపురంటౌన్: స్తంభాన్ని ఢీకొని ద్విచక్ర వాహనచోదకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై క్షతగాత్రుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలం, వెంపలగూడ గ్రామానికి చెందిన డి.మన్మథరావు బుధవారం పార్వతీపురం వచ్చి, అదేరోజు రాత్రి తన స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. గరుగుబిల్లి మండలం సుంకి గ్రామ సమీపంలో నాగావళి నదిపై ఉన్న వంతెన దాటుతుండగా.. పక్కనే ఉన్న స్తంభాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మన్మథరావు ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో జిల్లా ఆసుపత్రికి తీసుకువచ్చి అత్యవసర సేవలు అందిస్తున్నారు.

విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ



ప్రత్యేక శిక్షణా తరగతి కేంద్రాన్ని పరిశీలించిన డీడీ అన్నదొర

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ పరిధిలో ఇటీవల పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో తప్పిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని పీవో శుభం బన్సాల్ బుధవారం తెలిపారు. దీనిలో భాగంగా ప్రత్యేక శిక్షణా తరగతులకు అవసరమైన కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. బాలికలకు హడ్డుబంగి, బాలురకు మల్లి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో ప్రారంభించారు. పదో తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాలు ఏ మేరకు బోధించాలి అనే దానిపై జిల్లా గిరిజన సంక్షేమశాఖ డీడీ అన్నదొర, ఉపవిద్యాశాఖాధికారి పాలకనారాయుడు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో కోటిబాబు, సీఎంవో చిరంజీవులు, జీసీడీవో రాములమ్మ, ఏపీ శ్రీనివాస్, సునీత పాల్గొన్నారు.

చందనోత్సవాలు ప్రారంభం



నృసింహస్వామి దర్శనానికి క్యూకట్టిన భక్తులు

పార్వతీపురంటౌన్: జిల్లా కేంద్రంలోగల శ్రీలక్ష్మీ సమేత నృసింహస్వామి చందనోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 6 గంటల నుంచి ఆలయ ప్రధాన అర్చకులు తిరుపతి ప్రసాద్, గణపతి ప్రసాద్ పండా ఆధ్వర్యంలో పూర్ణకలశ స్థాపన, ధ్వజారోహణ, దీపారాధన, చందనాభిషేకం నిర్వహించారు. గురువారం ప్రత్యేక పూజలు, శుక్రవారం శ్రీస్వామివారి నిజరూప దర్శనం ఉంటుందని తెలిపారు. అదేరోజు సాయంత్రం నిర్వహించనున్న లక్ష్మీ సమేత నృసింహస్వామి వార్షిక కల్యాణ మహోత్సవంలో భక్తులు పాల్గొనాలని వారు కోరారు.

పోలింగ్ కేంద్రాలకు కూల్ పెయింటింగ్

వీరఘట్టం: మండలంలోని పోలింగ్ కేంద్రాల శ్లాబులపై ఉన్నతాధికారుల ఆదేశాలతో కూల్ పెయింటింగ్ వేస్తున్నారు. దీంతో పోలింగ్‌కు వచ్చే ఓటర్లకు ఎండల తీవ్రత నుంచి కొంత ఉపశమనం కలగనుంది. ఎండలు ఎక్కువగా ఉండడం కారణం గా పోలింగ్‌కు వచ్చే ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా ఈ చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ జైప్రకాశం తెలిపారు.

ఒడిశాను అగ్రస్థానంలో నిలుపుతాం

● కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్

ఒడిశా

రాయగడ: మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో ప్రగతిని సాధిస్తూ అగ్రపథంలో దూసుకుపోతోందని, ఒడిశా రాష్ట్రాన్ని కూడా అగ్రస్థానంలో నిలుపుతామని కేంద్రమత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన బుధవారం రాయగడలో పర్యటించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ఆయుష్మాన్ భారతీ, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, విశ్వకర్మ యోజన వంటి పథకాల ద్వారా ఎంతో మంది లబ్ధిపొందారని వివరించారు. ఈసారి ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలుపుతామన్నారు. దేశప్రగతి, రాష్ట్రాభివృద్ధి కోసం బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శివపట్నాయక్, లోకసభ అభ్యర్థి కాళీరాం మాఝి, శాసనసభ అభ్యర్థి బసంత ఉలకా, టుటుదాస్, సీనియర్ బీజేపీ అభ్యర్థులు పాల్గొన్నారు.

గిరిజన మహిళకు ప్రసవ వేదన

● రహదారి సౌకర్యం లేక అష్ట కష్టాలు



ప్రసవ వేదన పడుతున్న మహిళను తీసుకెళుతున్న దృశ్యం

జియ్యమ్మవలస: గ్రామానికి రహదారి సౌకర్యం లేక అర్నాడ పంచాయతీ అర్నాడవలస గ్రామ గిరిజన మహిళ ఆరిక అర్జన్ని తీవ్ర ప్రసవ వేదన పడాల్సిన దారుణ పరిస్థితి ఏర్పడింది. మంగళవారం రాత్రి ఆమెకు పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి. అత్యవసర 108కు ఫోన్ చేద్దామన్నా గ్రామానికి రోడ్డు సౌకర్యం లేదు. ఎంతో కష్టం మీద పురిటి నొప్పులతోనే ఆటోలో 4 కిలో మీటర్లు ఉన్న జియ్యమ్మ వలస పీహెచ్‌సీకి ఆ గ్రామ గిరిజనులు తీసుకొని వెళ్లారు. వెళ్లగానే ఆమె ఆసుపత్రిలో ప్రసవించింది. అయితే ఆటోలో గతుకుల ప్రయాణం వల్ల తీవ్ర రక్తస్రావం అయ్యింది. అలాగే శరీరంలో రక్తం తక్కువగా ఉండటంతో పీహెచ్‌సీ వైద్యాధికారి పి.జగదీష్ అక్కడి నుంచి జిల్లా కేంద్రాసుపత్రికి అత్యవసర చికిత్స నిమిత్తం తరలించారు.

కాలినడకే శరణ్యం

ఈసందర్భంగా గ్రామ పెద్ద మెల్లక సురేష్ మాట్లాడుతూ గ్రామానికి ఒకవైపు అర్నాడ, మరోవైపు డంగభద్ర పంచాయతీ కేంద్రం ఉన్నాయన్నారు. ఎటువైపు వెళ్లాలన్నా కాలినడకే శరణ్యమని వాపోయారు. ఉపాధి హామీ పథకం ద్వారా కనీసం గ్రావెల్ రోడ్డు నిర్మించాలని ఎన్నో సార్లు అధికారుల చుట్టూ తిరిగినా కనీసం ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దయనీయ పరిస్థితి చూసైనా కలెక్టర్ గానీ, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి గానీ స్పందించి తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆ గ్రామ గిరిజనులు కోరుతున్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● డీఎంవో జగన్మోహన్‌రావు ● దోనుబాయి పీహెచ్‌సీ తనిఖీ



దోనుబాయి పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంవో జగన్మోహన్‌రావు

సీతంపేట: వ్యాధులు ప్రబలకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి టి.జగన్మోహన్‌రావు ఆదేశించారు. ఈ మేరకు ఆయన మండలంలో దోనుబాయి పీహెచ్‌సీని మంగళవారం సందర్శించారు. ల్యాబ్ రికార్డులు తనిఖీ చేసి, జ్వరాలు ఏ మేరకు నమోదు అవుతున్నాయో పరిశీలించారు. జ్వర లక్షణాలున్న వారికి సత్వరమే రక్తపూతలు సేకరించి నివేదికలు తెలియజేయాలని అన్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని, పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, శిశువుల్లో ఏ చిన్న ఆరోగ్య సమస్య తలెత్తినా వెంటనే హైరిస్క్‌గా పరిగణించి తగు చికిత్స అందించి పర్యవేక్షించాలని ఆదేశించారు. గ్రామాల్లో ఎవరికైనా జ్వర లక్షణాలు ఉంటే జాప్యం చేయక వెంటనే నివారణ పరీక్షలు జరిపి మలేరియా, డెంగ్యూగా గుర్తిస్తే ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. రక్తహీనత నివారణపై ఎక్కువగా దృష్టి సారించాలన్నారు. ఆశ కార్యకర్తలు, వారి పరిధిలో గర్భిణులు, బాలింతలు, కిల్కారివాయిస్ సందేశాన్ని వినేలా చూడాలన్నారు. గ్రామాల్లో డ్రైడే కార్యక్రమాలు పక్కాగా చేపట్టి, మలేరియా, డెంగ్యూ జ్వరాలు ప్రబలకుండా నివారణ చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో సూర్యనారాయణ, వైద్యాధికారి డాక్టర్ జి.గిరీష్, సూపర్‌వైజర్లు దమయంతి, గంగమ్మ, ఎంటీఎస్ ఝాన్సీరాణి, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల సమీప ఇళ్లకు నోటీసులు



సాలూరులో నోటీసు ఇస్తున్న పోలీసు

సాలూరు రూరల్: పార్వతీపురం మన్యం జిల్లాలో పోలింగ్ కేంద్రాల సమీప వంద మీటర్ల దూరంలో ఉన్న ఇళ్ల యాజమానుకు పోలీసులు నోటీసులు అందిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు జిల్లాలో 769 ప్రాంతాల్లో 1,037 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ నిర్వహణకు ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, ఆదర్ పోలింగ్ అధికారుల నియామకం చేశారు. పీవో, ఏపీవోలకు రెండు విడతలుగా శిక్షణ సైతం పూర్తి చేశారు. వారందరు ఈ నెల 12న పోలింగ్ స్టేషన్ల ఉన్న ప్రాంతాలకు ఎన్నికల సామాగ్రితో చేరుకుంటారు. ఈక్రమంలో పోలింగ్ కేంద్రాలకు వంద మీటర్ల దూరంలో ఉన్న ఇళ్లలో ఈనెల 12, 13 తేదీల్లో కేవలం కుటుంబ సభ్యులు మాత్రమే ఉండాలని, ఇతరులను, ఏ పార్టీ వారి వ్యక్తులను అనుమతించొద్దని నోటీసులో పోలీసులు సూచించారు. అలాగే పోలింగ్ రోజు ఇళ్ల డాబాల మీదకు ఎక్కవద్దని, అనవసర రాకపోకలు సాగించవద్దని సూచించారు. ఆయా తేదీల్లో పోలింగ్ కేంద్రాల సమీపంలో ఎటువంటి పంక్షన్లు చేయరాదని పోలీసులు సూచిస్తున్నారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల సమీపంలో ఉన్న ఇళ్ల యాజమానులకు నోటీసులు అందిస్తున్నారు.

నవధాన్యాలతో జీవ వైవిధ్యం



నవధాన్యాల విత్తన కిట్లును పంపిణీ చేస్తున్న దృశ్యం

కొమరాడ: నవధాన్యాలతో జీవ వైవిధ్యం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయ ఎస్ఎఫ్ఏ ఆర్.శ్రీనివాస్ అన్నారు. బుధవారం గంగరేగువలసలో రైతులకు ఆయన 30 రకాల ప్రకృతి వ్యవసాయ విత్తనాల కిట్లును పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వనధాన్యాల సాగు వల్ల భూమిలో జీవ వైవిధ్యంతో పాటు నేలలో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందన్నారు. నేలలో మేలు చేసే సూక్ష్మ జీవులు, వానపాములు పెరుగుతాయని చెప్పారు. నవధాన్యాలు వేసిన 45 రోజుల్లోపు భూమిని కలియ దున్నడం వల్ల ప్రధాన పంటకు అవసరమైన సూక్ష్మ, స్థూల పోషకాలు సమృద్ధిగా లభించడం వల్ల పంటల దిగుబడి పెరుగుతుందని చెప్పారు. పశువుల దాణాతో పాటు ఇంటి అవసరాలకు ఆకు కూరగాయలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఐఆర్‌పీలు, రైతులు పి.లక్ష్మి, ఎస్.పద్మావతి, పి.రూపవతి, వై.చంద్రశేఖర్, ఎం.అనసూయ, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



కవాతు చేస్తున్న పోలీసులు

మక్కువ: సార్వత్రిక ఎన్నికలకు గడువు సమీపిస్తున్న సందర్భంగా మండల కేంద్రంలో ఎస్ఐ పి.నరసింహమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలని కోరారు. వివాదాలకు దూరంగా ఉండాలన్నారు. స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన



కిచ్చాడలో యువకులతో మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కురుపాం: ఈనెల 13న సార్వత్రిక ఎన్నికలు జరగనున్న సందర్భంగా కురుపాం పోలీస్‌స్టేషన్ పరిధిలోగల కురుపాం, కిచ్చాడ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఎస్పీ విక్రాంత్ పాటిల్ బుధవారం పరిశీలించారు. కురుపాం జడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించి, డీఎస్పీ కృష్ణారావు, సీఐ సత్యనారాయణకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. అలాగే కిచ్చాడ పోలింగ్ కేంద్రాన్ని ఎస్పీ పరిశీలించి, అక్కడ యువకులు, ప్రజలతో మాట్లాడి ఎన్నికల దృష్ట్యా పలు సూచనలు ఇచ్చారు.

సేంద్రియ వ్యవసాయంతోనే సంపూర్ణ ఆరోగ్యం

గరుగుబిల్లి: సేంద్రియ వ్యవసాయంపై గ్రామీణ ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు సూచించారు. మండలంలోని తోటపల్లిలో సేంద్రియ వ్యవసాయ క్షేత్రాలను ఆయన బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో అధికంగా రసాయనిక ఎరువులు వినియోగించడంతో రోగాల బారిన పడాల్సిన దుస్థితి నెలకొందన్నారు. గ్రామ స్థాయిలో రైతుల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పలువురికి ఆరోగ్యకరమైన కిట్లును అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ డాక్టర్ మంచిపల్లి శ్రీరాములు, తదితరులు ఉన్నారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోండి

భోగాపురం: ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని విజయనగరం ఎస్పీ ఎం.దీపికాపాటిల్ పిలుపునిచ్చారు. బుధవారం ముక్కాం గ్రామంలో ఓటుహక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్లు ఎటువంటి భయభ్రాంతులకు, ప్రలోభాలకు గురికావద్దని అన్నారు. జిల్లాలో ఓటింగు శాతాన్ని పెంచేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఆమె కోరారు. ఓటర్లకు ఏమైనా ఇబ్బందులు ఎదురైతే పోలీసులకు ఫిర్యాదులు చేయాలన్నారు. ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఆర్.గోవిందరావు, సీఐ ఎ.రవికుమార్, పోలీస్ సిబ్బంది, ముక్కాం, కొండ్రాజుపాలెం, చేపలకంచేరు గ్రామాలకు చెందిన ఓటర్లు, మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

భోగాపురం: దల్లిపేట గ్రామానికి చెందిన దల్లి అప్పలరాముడు(65) ఆత్మహత్యకు పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అప్పలరాముడు భార్య గతేడాది జూన్‌లో మృతి చెందింది. అప్పటి నుంచి అప్పలరాముడు విచారంతో మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో మంగళవారం ఉదయం అప్పలరాముడు ఇంటికి వారి బంధువు ఒకాయిన వెళ్లాడు. ఆయన వెళ్లేసరికి అప్పలరాముడు ఇంట్లో అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. నోటిలో నురగలు కూడా ఉన్నాయి. పక్కనే పినాయల్ డబ్బా ఉంది. దీంతో ఆత్మహత్యకు పాల్పడినట్టు అనుమానించి బంధువు చికిత్స నిమిత్తం విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పలరాముడు అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీనిపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

జయకృష్ణ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

వీరఘట్టం: కూటమి పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థి జయకృష్ణ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్విని పిలుపునిచ్చారు. బుధవారం నడుకూరు గ్రామంలో జనసేన, బీజేపీ, టీడీపీ ఉమ్మడి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పవన్‌కళ్యాణ్ ఆశయ సాధనతో జయకృష్ణను గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అరకు పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీతకు కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. పాలకొండ నియోజకవర్గ జనసేన అబ్జర్వర్ ఓంపూర్ గంగయ్య, మాజీ ఎమ్మెల్యే నిమ్మక గోపాలరావు సతీమణి నిమ్మక రమణమ్మ, నిమ్మల నిబ్రం, బీపీ నాయుడు, పుండరీ, జానీ, భాస్కరరావు, శ్రీనివాస్, లంక సన్నిబాబు, మచ్చ వెంకటరమణ పాల్గొన్నారు. ● **సీతంపేట:** కూటమి అభ్యర్థి నిమ్మక జయకృష్ణ గెలుపునకు కార్యకర్తలంతా కృషి చేయాలని జనసేన నియోజకవర్గం ఇన్‌చార్జి నిబ్రహం, మండల అధ్యక్షుడు విశ్వనాథం కోరారు. మండ, జొన్న గ్రామాల్లో వారు బుధవారం ప్రచారం నిర్వహించారు. ● **పాలకొండ:** రానున్న ఎన్నికల్లో పాలకొండ నియోజకవర్గ జనసేన అభ్యర్థి నిమ్మక జయకృష్ణకు గాజుగ్లాజు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కూటమి నాయకులు కోరారు. బుక్కూరు గ్రామంలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి నాయకులు గండి రామినాయుడు, గర్భాన సత్తిబాబు, నిమ్మక మాధురి, యోగిత, మిడితాన ప్రసాద్, పెనుగొండ రాజశేఖర్, డింక శివ ప్రసాద్ పాల్గొన్నారు.

చంద్రబాబు సభను విజయవంతం చేయాలి

గుమ్మలక్ష్మీపురం: కురుపాంలో గురువారం జరగనున్న చంద్రబాబు బహిరంగ సభను విజయవంతం చేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోయక జగదీశ్వరి విజ్ఞప్తి చేశారు. కురుపాం, రావాడ జంక్షన్‌లో ఈ సభ నిర్వ హిస్తున్నామని, ఈ సభకు టీడీపీ, జనసేన, బీజేపీ కార్యక ర్తలు, నాయకులు, అభిమానులు హాజరై విజయంతం చేయాలని ఆమె కోరారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు

సీతంపేట: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈ విద్యా సంవత్సరం వివిధ కోర్సుల్లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ గోపాలకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ ఐటీఐలో ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్, మెకానిక్, వెల్డర్, కంప్యూటర్ ఆపరేటర్, ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, డ్రెస్ మేకింగ్ వంటి కోర్సులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని చెప్పారు. ఈనెల 9 నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

సీపీఎం నాయకుల ప్రచారం

పాలకొండ: ఈనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ నాయకులు కోరారు. సింగన్నవలస పంచాయతీలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు ఎస్.పుణ్యవతి మాట్లాడుతూ అరకు పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి పాచిపెంట అప్పలనరసకు సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.